ఆయిల్ పామ్ లాభదాయకం

- సాగు చేస్తే మంచి దిగుబడి
- రైతులకు అధికారులు, శాస్త్రవేత్తలు దిశానిర్దేశం
- జగిత్యాలలో హార్టికల్చర్ శాఖ, లోహియా కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు
- హాజరైన ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, విదేశీ శాస్త్రవేత్తలు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, పక్కన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల టౌన్ జూన్12: సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయం ఆయిల్‌పామ్ పంట అని, సాగు లాభదాయకమని రైతులకు వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు దిశానిర్దేశం చేశారు. జగిత్యాల జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా ఉద్యానవన శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కారు అండగా ఉంటుందని ప్రజాప్రతినిధులు భరోసానిచ్చారు. ఫీల్డ్ ఆఫీసర్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఆయిల్ పామ్ సాగు, మార్కెటింగ్ విషయంలో ప్రభుత్వ సహకారం ఉంటుందని చెప్పారు. మార్కెటింగ్ పరంగా రైతులకు సహాయం చేస్తామని ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి భరోసాఇచ్చారు. ఈ సందర్భంగా లోహియా కంపెనీ ప్రతినిధులకు పలు ప్రశ్నలు సంధించారు. ఆయిల్‌పామ్ పంటను ఎంత ధరకు కొంటారనే విషయాన్ని రైతులకు చెప్పాలని సూచించారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో రేటు పడిపోతే రైతుల పరిస్థితి ఏంటని అడిగారు. దీనికి కంపెనీ ప్రతినిధులు బదులిస్తూ.. ఆయిల్ పామ్ సాగుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీని అందిస్తున్నాయని, మద్దతు ధరను కూడా ప్రభుత్వమే నిర్ణయించాలని కోరారు. మీరు ఇలా మాట్లాడితే రైతులు నిరుత్సాహపడతారని చెప్పారు. మీరు మాకోసం ఇక్కడ కాదు అసెంబ్లీలో కొట్లాడండి అని ఒకింత ఘాటుగా సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ విధివిధానాల కమిటీలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో పాటు నేను ఒక మెంబర్‌ను అని గుర్తు చేశారు. రైతులకు 90 శాతం దళితులైతే 100 శాతం సబ్సిడీ ఇస్తామని చెప్పి ప్రోత్సహించామన్నారు. ఎకరా పంటకు ఏడాదికి ₹4200 ప్రోత్సాహకం ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు అండగా నిలువాలని కోరారు. లోహియా స్టేట్ టెక్నికల్ కన్సల్టెంట్ రంధనాయకులు మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటకు కోతుల, అడవి పందుల బెడద ఉండదన్నారు. అదేవిధంగా తుఫాన్, వడగండ్ల వానలు వచ్చినా తట్టుకుంటుందన్నారు. ప్రస్తుతం జగిత్యాల జిల్లాలో 3,965 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను రైతులు సాగు చేస్తున్నారన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆయిల్‌పామ్ రైతులు ప్రస్తుతం ఆయోమయంలో ఉన్నారని, వారి సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత హార్టికల్చర్ అధికారులపై ఉన్నదన్నారు. ఇక్కడ హార్టికల్చర్ జిల్లా అధికారి ప్రతాప్‌సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చర్ అధికారి కల్పన, లోహియా కంపనీ సీఈవో సిద్ధాంత్ లోహియా, హార్టికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ శ్యామ్‌ప్రసాద్, మండల హార్టికల్చర్ ఆఫీసర్ స్పందన, జడ్పీటీసీ బాదినేని రాజేందర్ ఉన్నారు.

హాజరైన రైతులు, మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

డిమాండ్ అనుగుణంగా ఉత్పత్తి పెరుగాలి

విదేశీ శాస్త్రవేత్తలు జగిత్యాల జిల్లా రైతులకు ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పించడం అభినందనీయం. తక్కువ విస్తీర్ణం ఉన్న మలేషియా, ఇండోనేషియా లాంటి దేశ రైతులు ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. మన రైతులు కూడా విదేశాలకు వెళ్లివారి సాగు విధానాలను తెలుసుకొని వచ్చారు. భవిష్యత్‌లో పామాయిల్‌కు గణనీయమైన డిమాండ్ ఉంటుంది. అందుకు అనుగుణంగా ఉత్పత్తి పెరగాలి. దిగుమతులను అధిగమించి ఆయిల్ పామ్ పంటలను సాగు చేయాలి. లోహియా కంపెనీ మంచి రకం మొక్కలను అందిస్తున్నది. 1993 ఆయిల్‌పామ్ చట్టం ప్రకారం ప్రభుత్వం పంటకు గ్యారంటీ ఇస్తుంది. అగ్రిమెంట్ ప్రకారం నర్సరీలలో మొక్కలను తయారు చేసి రైతులకు అందించాం. డ్రిప్ సిస్టం అందని రైతులకు కంపెనీతో మాట్లాడి త్వరలోనే ఇప్పిస్తాం. సాగు చేసే రైతులకు 15 కిలోమీటర్ల పరిధిలో కలెక్ట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయాలి. రైతులు, ఏఈవోలతో ఒక గ్రూప్ తయారు చేసి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా.

- షేక్ యాస్మిన్ బాషా, జగిత్యాల కలెక్టర్

ఎనిమిది నెలల్లోనే పూత

జగిత్యాల, కరీంనగర్ జిల్లాలో చాలామంది రైతులు ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నారు. ఇక్కడ 14 నెలల నుంచి 16 నెలల వరకు పూత వస్తుందని భావించాం. కానీ ఎనిమిది నెలల్లోనే పూత వచ్చింది. సంతోషంగా ఉంది. మూడు నెలలకోసారి ఇక్కడికి వస్తం. నిరంతరం మీకు సేవలు అందిస్తాం.

-శ్రీవిజయన్, ఇండోనేషియా శాస్త్రవేత్త

మంచి ఫ్యూచర్ ఉంటది

భవిష్యత్‌లో ఆయిల్‌పామ్ వినియోగం పెరుగుతుంది. 1990 నుంచి ఇతర దేశాలకు నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నాం. 70 సంవత్సరాల అనుభవం ఉన్న సీడ్ కంపెనీ ద్వారా మీకు విత్తనాలు వస్తున్నాయి. రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దు. గ్లోబల్ మార్కెట్‌లో ఈ విత్తనాలకు గిరాకీ ఎక్కువగా ఉంది. రీసెర్చ్ చేసి పొట్టి జాతి విత్తనాలను మీకు అందిస్తున్నాం.

-నికోలస్ తంబుల్, మలేషియా శాస్త్రవేత్త

లాభదాయకమైన పంట.

సదస్సులో జగిత్యాల రైతులను కలువడం ఆనందంగా ఉన్నది. ఆయిల్‌పామ్ ఇతర పంటల కంటే లాభదాయకమైన పంట. మా దేశంలో 80 ఏండ్ల అనుభవం ఉన్న సీడ్ కంపెనీలు ఉన్నాయి. ఇక్కడి వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన ఆయిల్‌పామ్ విత్తనాలను అందిస్తున్నాం. మూడు సంవత్సరాల నుంచి 30 ఏండ్ల వరకు దిగుబడి వస్తుంది.

- జావియర్ లకన్, ఫ్రాన్స్ శాస్త్రవేత్త

మొదట భయపడ్డ

ఆయిల్‌పామ్ వేసిన మొదట్లో పంట ఎక్కడ అమ్మాలో తెలియక భయపడ్డ. ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని గొల్లపల్లి మండలం యశ్వంతరావుపేటలో ఏర్పాటు చేస్తున్నారని తెలిసి సంతోషించిన. 10 ఎకరాల్లో సాగు చేసిన. మొత్తం 500 మొక్కలు పెట్టిన. తోటలో 70 శాతం వరకు పూత వచ్చింది. పోయిన సంవత్సరం నాటిన నాకు ఇంకా సబ్సిడీ రాలేదు. త్వరగా ఇప్పించాలి.

- కొమ్మినేని తిరుపతి, గోపులాపూర్ (బుగ్గారం మండలం)

పత్తికి ప్రత్యామ్నాయం

గతంలో పత్తి పంటను సాగు చేసిన. ఆశించిన లాభాలు రాలేదు. అందుకే దానిని విడిచి పెట్టి ఆయిల్‌పామ్‌ను ఎంచుకున్న. నాలుగేకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలను నాటిన. కొమ్ము పురుగుతో మొదట్లో నేను ఆందోళన పడ్డ. హార్టికల్చర్ అధికారుల సూచనలు తీసుకొని మందును పిచికారీ చేసిన. ఇప్పుడు పూత ఏపుగా వచ్చింది. ఈ పంటకు కోతుల, అడవి పందుల బెడద లేదు.

- రాయంచ పద్మ, తిప్పయ్యపల్లె (కొడిమ్యాల మండలం)

ఐదెకరాల్లో వేసిన

గతంలో చెరుకు సాగు చేయాలని అధికారులు వెంట పడ్డారు. ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ ఉన్న సమయంలో ఈ పంట వేసిన. ఇప్పుడు అధికారులు చెప్పడంతో నాకున్న ఐదెకరాల్లో ఆయిల్‌పామ్‌ను వేసిన. మా వద్ద కోతుల బెడద ఉండి ఏ పంట వేసినా కష్టంగా ఉండేది. ఇప్పుడు ఎలాంటి ప్రాబ్లం లేదు. అంతర పంటగా సరుగుడు చెట్లను పెట్టిన.

- గుడి లక్ష్మారెడ్డి, పోరుమల్ల (మేడిపల్లి మండలం)

రూ.లక్ష విరాళం చెక్కును హెడ్మాస్టర్ అశోక్‌రెడ్డికి అందజేస్తున్న రిటైర్డ్ టీచర్ రాఘవులు

రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఔదార్యం

భార్య స్మారకార్థం సొంతూరి బడికి రూ. లక్ష విరాళం

ఓదెల, జూన్ 12: రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఔదార్యాన్ని చాటాడు. సొంతూరిలోని సర్కారు బడికి రూ.లక్ష విరాళమిచ్చాడు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం మడక గ్రామానికి చెందిన రాఘవులు కొన్నేండ్ల క్రితం విరమణ పొందాడు. ఇటీవల ఆయన భార్య అహల్య అనారోగ్యంతో మరణించింది. దీంతో ఆమె స్మారకార్థం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. లక్ష విరాళమిచ్చాడు. బుధవారం చెక్కును హెడ్మాస్టర్ అశోక్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నోముల పద్మావతి– ఇంద్రారెడ్డి, నోముల రమణారెడ్డి, ఉపాధ్యాయులు సిద్ధయ్య, రమాదేవి, సుహాసినీ, లక్ష్మణ్, సత్యనారాయణ ఉన్నారు.

'గల్ఫ్' ఆశలు అడియాశలు

షేక్ అబ్దుల్లా, సయ్యద్‌చాంద్ (ఫైల్)

- వీసా కోసం ఇంటర్వ్యూకు వెళ్తుండగా బైక్‌ను ఢీకొట్టిన డీసీఎం
- అక్కడికక్కడే ఇద్దరు యువకుల దుర్మరణం • కామారెడ్డి జిల్లా మల్లుపల్లిలో విషాదం

గంభీరావుపేట, జూన్ 12: ఆ ఇద్దరివి నిరుపేద కుటుంబాలే.. రెక్కాడితే డొక్కాడని బతుకులు.. బయటి దేశానికి వెళ్లే నాలుగు రూపాయలు సంపాదించుకోవచ్చని ఆశ పడితే.. ఆ ఆశ అడియాసే అయింది. వీసా కోసం ఇంటర్వ్యూకు వెళ్లే క్రమంలో ఓ వ్యాన్ ఢీకొని ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందడం విషాదం నింపింది. వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండలం మల్లుపల్లికి చెందిన షేక్‌అబ్దుల్లా(32), సయ్యద్ చాంద్(38) ఇద్దరు కూలీ పని చేసేవారు. ఉపాధి కోసం మస్కట్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. వీసా ప్రయత్నంలో భాగంగా ఇంటర్వ్యూ కోసం బుధవారం ఉదయం 6 గంటలకు మల్లుపల్లి నుంచి సిరిసిల్లకు బైక్‌పై బయలుదేరారు. గంభీరావుపేట మండలం కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారి పెద్దమ్మ అటవీ ప్రాంతానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొని అబ్దుల్లా, చాంద్ అక్కడికక్కడే చనిపోయారు. విషయం తెలియడంతో బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. తమ కొడుకులకు ఇంత మంచి పని దొరికి బాగు పడుతారనుకుంటే ఇలా అర్ధంతరంగా వదిలేసి పోయారని విలపించారు. అబ్దుల్లాకు ఇద్దరు కొడుకులు, కూతురు.. చాంద్‌కు కొడుకు, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

లా పట్టభద్రుల ఎంపిక కోసం దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 12: అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడేండ్ల శిక్షణకు గానూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన లా పట్టభద్రులను ఎంపిక చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సిరిసిల్ల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా ఏ వినోద్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరంలో ఎనిమిది మంది షెడ్యూల్డ్ కులాల లా పట్టభద్రులను శిక్షణ కోసం ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అందుకోసం ఉమ్మడి జిల్లావాసులు ఆన్‌లైన్‌లో (https://telanganaepass.cgg. gov.in) దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాగా, శిక్షణ కోసం ఎంపికైన వారికి నెలకు ₹3వేల స్టైఫండ్, పుస్తకాలు, ఫర్నిచర్ కోసం ₹50వేలు మంజూరు చేస్తామని వెల్లడించారు. దరఖాస్తులను జూలై 6వ తేదీలోగా సమర్పించాలని, అభ్యర్థుల ఎంపిక జూలై 15న ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం ఉమ్మడి జిల్లాల్లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

హైదరాబాద్-అయోధ్య మధ్య ఫ్లైట్ రద్దు

డిమాండ్ లేకపోవడంతో నిలిపివేసిన స్పైస్‌జెట్

ముంబై, జూన్ 12: హైదరాబాద్ నుంచి అయోధ్యకు నేరుగా నడిపే విమాన సర్వీసులను నిలిపివేస్తున్నట్లు చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ప్రకటించింది. రెండు నెలల క్రితం ప్రారంభించిన ఈ విమాన సర్వీసుకు డిమాండ్ లేమి కారణంగా రద్దు చేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో హైదరాబాద్–అయోధ్యల మధ్య వారానికి మూడు సార్లు నడిపే సర్వీసును ప్రారంభించింది. డిమాండ్–సప్లై ఆధారంగా విమాన సర్వీసులను నడుపుతున్నట్లు, ఈ సర్వీసును రద్దు చేసినప్పటికీ చెన్నై–అయోధ్యల మధ్య విమాన సర్వీసును యథాతథంగా నడుపుతున్నట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. అలాగే జనవరి 21 నుంచి ఢిల్లీ నుంచి అయోధ్యకు సంస్థ విమానాన్ని నడుపుతున్నది.

జీవిత బీమాపై రుణాలివ్వాల్సిందే

ఇన్సూరెన్స్ సంస్థలతో ఐఆర్డీఏఐ

న్యూఢిల్లీ, జూన్ 12: అన్ని జీవిత బీమా సేవింగ్స్ ప్లాన్లలో పాలసీ లోన్ సదుపాయం అనేది ఇకపై తప్పనిసరి అని బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్డీఏఐ బుధవారం ఇన్సూరెన్స్ కంపెనీలకు స్పష్టం చేసింది. జీవిత బీమా తీసుకున్న పాలసీదారులకు నిబంధనలకు లోబడి వారి పిల్లల ఉన్నత చదువులు, పెండ్లిళ్లు, గృహ నిర్మాణం లేదా కొనుగోలు, వైద్య చికిత్స తదితర నగదు అవసరాలను బట్టి రుణాలు ఇవ్వాల్సిందేనని సదరు సంస్థలకు చెప్తూ ఓ మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసింది. జీవిత బీమా పాలసీలకు సంబంధించి ఉన్న అన్ని రెగ్యులేషన్లను ఏకం చేస్తూ దీన్నిచ్చింది. ఇక పాలసీదారులు తమ పాలసీ నిబంధనలు, షరతులను సమీక్షించేందుకున్న సమయాన్ని (ఫ్రీ లుక్ పీరియడ్) 15 రోజుల నుంచి 30 రోజులకు ఐఆర్డీఏఐ పెంచింది. ఇప్పటికే జనరల్ ఇన్సూరెన్స్ పాలసీల కోసం కూడా ఐఆర్డీఏఐ ఇదే తరహా మాస్టర్ సర్క్యులర్‌ను విడుదల చేసిన సంగతి విదితమే. కాగా, పాలసీలను సరెండర్ చేస్తే పాలసీదారులకు ప్రయోజనకరంగా బీమా సంస్థల నిర్ణయాలుండాలని ఐఆర్డీఏఐ తెలిపింది.

హెల్మెట్లపై జీఎస్టీ ఎత్తేయండి

కౌన్సిల్‌ను కోరిన ఐఆర్ఎఫ్

న్యూఢిల్లీ, జూన్ 12: హెల్మెట్లపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)ను ఎత్తివేయాలని బుధవారం జీఎస్టీ కౌన్సిల్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలను అంతర్జాతీయ రోడ్డు సమాఖ్య (ఐఆర్ఎఫ్) కోరింది. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ పడుతున్నది. దీంతో దీన్ని సున్నా (నిల్ లేదా జీరో)కు చేర్చాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. హెల్మెట్ల వాడకాన్ని పెంచేందుకు ఈ నిర్ణయం దోహదం చేయగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై ద్విచక్ర వాహనదారులే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారన్న ఐఆర్ఎఫ్.. హెల్మెట్లపై జీఎస్టీని తొలగిస్తే వాటి అమ్మకాలు పెరిగి, తద్వారా టూవీలర్ వినియోగదారుల భద్రత కూడా పెరుగుతుందన్నది. ఈ క్రమంలోనే ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాద మరణాల్లో దాదాపు 12 శాతం భారత్‌లోనే సంభవిస్తున్నాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను 15.71–38.81 బిలియన్ డాలర్ల మేర నష్టపరుస్తున్నట్టు బాష్ నివేదిక పేర్కొన్నదని ఐఆర్ఎఫ్ గుర్తుచేసింది.

వాణిజ్య

అత్యంత విలువైన సంస్థగా యాపిల్

న్యూయార్క్, జూన్ 12: ప్రపంచంలో అత్యంత విలువైన సంస్థగా మళ్లీ యాపిల్ అవతరించింది. ఇప్పటి వరకు తొలి స్థానంలో కదలాడిన మైక్రోసాఫ్ట్‌ను అధిగమించి యాపిల్ తిరిగి తొలి స్థానాన్ని దక్కించుకున్నది. అంతర్జాతీయంగా ఐఫోన్ల అమ్మకాలు భారీగా పుంజుకోవడంతో కంపెనీ షేరు ధర రికార్డు స్థాయిలో లాభపడటమే ఇందుకు కారణం. కంపెనీ షేరు ధర 4 శాతం లాభపడి 215.04 డాలర్లకు చేరుకోవడంతో కంపెనీ మార్కెట్ విలువ 3.29 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇదే సమయంలో మైక్రోసాఫ్ట్ షేరు విలువ పడిపోవడంతో కంపెనీ మార్కెట్ క్యాప్ 3.24 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది.

ఇంజెస్‌తో రెడ్డీస్ జట్టు

Dr.Reddy's

న్యూఢిల్లీ, జూన్ 12: ప్రముఖ ఫార్మా సంస్థ డాక్టర్ రెడ్డీస్..అమెరికాకు చెందిన ఇంజెస్ ఫార్మాస్యూటికల్స్‌తో జట్టుకట్టింది. క్యాన్సర్ వ్యాధి చికిత్సకోసం వాడే సైక్లోఫాస్ఫమైడ్ ఇంజెక్షన్‌ను అక్కడి మార్కెట్లో విక్రయించడానికి సంస్థతో అధికారిక ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. 500 ఎంజీ/2.5 ఎంఎల్, 1గ్రాము/5 ఎంఎల్, 2గ్రాము/10 ఎంఎల్ రకాల్లో అమెరికా మార్కెట్లో ఈ ఔషధం లభించనున్నది. మార్చితో ముగిసిన ఏడాది కాలంలో ఈ ఔషధ విక్రయాలు 51.8 మిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి.

ఆగిన పారిశ్రామిక పరుగు

3 నెలల కనిష్ఠానికి పారిశ్రామికోత్పత్తి • ఏప్రిల్‌లో 5 శాతానికి ఐఐపీ పరిమితం

న్యూఢిల్లీ, జూన్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి వృద్ధిరేటు పడిపోయింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో 3 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 5 శాతానికే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) పరిమితమైంది. ఈ మేరకు బుధవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. దీన్నిబట్టి గనులు, విద్యుత్తు రంగాల ప్రదర్శన బాగున్నా.. కీలకమైన తయారీ రంగం తీరు పేలవంగా ఉండటమే ఐఐపీ క్షీణతకు కారణంగా నిలుస్తున్నది. ఈ ఏడాది మార్చిలో 5.4 శాతంగా, ఫిబ్రవరిలో 5.6 శాతంగా ఉన్న ఐఐపీ.. జనవరిలో 4.2 శాతంగానే ఉన్నది. మళ్లీ ఇప్పుడు అదే స్థాయి దరిదాపుల్లోకి ఏప్రిల్ గణాంకాలు నమోదయ్యాయి. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2023–24) ఐఐపీ వృద్ధిరేటు 5.9 శాతంగా ఉన్నది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2022–23) ఇది 5.2 శాతం. ఇకపోతే గత ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 4.6 శాతంగా నమోదైందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. దీంతో ఈసారి ఏప్రిల్‌లో పెరిగినట్టే కనిపిస్తున్నది. కానీ గత మూడు నెలలుగా క్రమేణా గణాంకాలు తగ్గుముఖం పడుతుండటం మాత్రం ఒకింత ఆందోళనే కలిగిస్తున్నది.

రంగాలవారీగా..

తాజా గణాంకాల ప్రకారం.. నిరుడు ఏప్రిల్‌తో పోల్చితే ఈ ఏప్రిల్‌లో గనుల రంగంలో ఉత్పాదకత వృద్ధి 6.7 శాతానికి పెరిగింది. నాడు 5.1 శాతమే. అలాగే విద్యుదుత్పత్తి కూడా 1.1 శాతం నుంచి 10.2 శాతానికి ఎగిసింది. అయితే తయారీ రంగంలో వృద్ధిరేటు ఏప్రిల్‌లో 3.9 శాతానికి క్షీణించింది. పోయినసారి ఏప్రిల్‌లో 5.5 శాతంగా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే ఐఐపీ ఓవరాల్ గ్రోత్ దెబ్బతిన్నది. దీనికితోడు క్యాపిటల్ గూడ్స్ విభాగం వృద్ధి సైతం 3.1 శాతానికి పతనమైంది. ఏడాది క్రిందట 4.4 శాతంగా ఉన్నదిది. కన్స్యూమర్ నాన్–డ్యూరబుల్ గూడ్స్ ఉత్పత్తి కూడా మైనస్ 2.4 శాతంలోకి దిగజారింది. నిరుడు ఏప్రిల్‌లో 11.4 శాతం వృద్ధి కనిపించింది. అందుకే కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి 9.8 శాతానికి పుంజుకున్నా ఫలితం లేకపోయింది. నిజానికిది పోయినసారి మైనస్ 2.3 శాతంలో ఉన్నది. మౌలిక, నిర్మాణ రంగాల్లో వృద్ధిరేటూ 8 శాతంగానే ఉన్నది. నిరుడు ఏప్రిల్‌లో 13.4 శాతం. ఇక ప్రైమరీ గూడ్స్ ఉత్పాదక రేటు 1.9 శాతం నుంచి 7 శాతానికి, ఇంటర్మీడియెట్ గూడ్స్ గ్రోత్ 1.7 శాతం నుంచి 3.2 శాతానికి పెరిగినా ఐఐపీని గతంతో పోల్చితే పెంచలేకపోయాయి.



స్వల్పంగా తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

రిటైల్ ద్రవ్యోల్బణం గత నెల స్వల్పంగా తగ్గింది. మే నెలలో 4.75 శాతంగా నమోదైంది. బుధవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఈ వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.83 శాతంగా ఉన్నది. అయితే నిరుడు మే నెలలో 4.31 శాతంగానే ఉన్నది. దీన్నిబట్టి ఈసారి అర శాతంపైనే పెరిగినట్టైంది. కాగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గరిష్ఠ ద్రవ్యోల్బణం స్థాయి 6 శాతం. కానీ ఆమోదయోగ్య స్థాయి 4 శాతమే. దీంతో ప్రస్తుత గణాంకాలు ఇంకా తగ్గాల్సి ఉన్నది. అప్పుడే వడ్డీరేట్లను తగ్గిస్తామని గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్పష్టం చేసినది తెలిసిందే. నిరుడు ఏప్రిల్ నుంచి కీలక వడ్డీరేట్లు యథాతథంగానే కొనసాగుతున్నాయి. చివరిసారిగా గత ఏడాది ఫిబ్రవరిలో వడ్డీరేట్లను ఆర్బీఐ పెంచింది.

ఇక అప్పట్నుంచి రెపోరేటు 6.5 శాతం వద్దే ఉన్నది. ఫలితంగా గృహ, వాహన, వ్యక్తిగత తదితర రుణాల భారం రుణగ్రహీతలపై పడుతూనే ఉన్నది. ఇదిలావుంటే మే నెలలో ఆహార ద్రవ్యోల్బణం 8.69 శాతంగా ఉన్నది. ఏప్రిల్‌లో ఇది 8.70 శాతంగా ఉన్నట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) తెలిపింది.



డిపాజిట్లపై తగ్గనున్న వడ్డీరేట్లు!

న్యూఢిల్లీ, జూన్ 12: డిపాజిట్లపై వడ్డీరేట్లు పతాకస్థాయికి చేరుకున్నాయని, స్వల్పకాలంలో ఈ రేట్లు తగ్గే అవకాశం ఉన్నదని ఎస్బీఐ చైర్మన్ దినేశ్ కుమార్ ఖారా తెలిపారు. అలాగే రిజర్వు బ్యాంక్ కూడా వడ్డీరేట్లను కూడా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నుంచి తగ్గించే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. గత వారంలో తన పరపతి సమీక్షలో ఆర్బీఐ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది మూడో త్రైమాసికం నుంచి రిటైల్ ధరల సూచీ నాలుగు శాతం దిగువకు తగ్గే అవకాశం ఉండటంతో ఆర్బీఐ వడ్డీరేట్లను తగ్గించేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. ఇప్పటికే పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయని, వీటిలో స్విట్జర్లాండ్, స్వీడన్, కెనడా, యూరో దేశాలు తగ్గించిన విషయం తెలిసిందే. మరోవైపు, గత నెలలో ఎస్బీఐ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లను 75 బేసిస్ పాయింట్ల వరకు పెంచిన విషయం తెలిసిందే.

రికార్డుస్థాయికి నిఫ్టీ

స్వల్పంగా పెరిగిన సెన్సెక్స్



ముంబై, జూన్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో భారీగా పుంజుకున్న సూచీలకు చివర్లో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో భారీ లాభాలను నిలుపుకోలేకపోయింది. బ్లూచిప్ షేర్లైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాపడటం మదుపరుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. వడ్డీరేట్లపై అమెరికా ఫెడరల్ నిర్ణయాన్ని ప్రకటించనున్నప్పటికీ పెట్టుబడిదారులను కొనుగోళ్ల వైపు నడిపించాయి. ఇంట్రాడేలో 600 పాయింట్ల వరకు లాభపడిన 30 షే